క్లుప్తంగా

ఎన్నికలపై అవగాహన అవసరం: డీఈఓ


ఎన్నికలను పరిశీలిస్తున్న డీఈఓ

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రతి ఒక్కరు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంచాయతీ నమూనా ఎన్నికలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన ఓటింగ్ ప్రక్రియపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించడంలో ఈ ఎన్నికలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు నింపండి సారూ..


కాలువలను పరిశీలిస్తున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదలచేసి చెరువులు, కుంటలునింపి రైతులను ఆదుకోవాలని మండల పరిధిలోని గంగాపూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు వేణుతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో ఎండిన కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వరినాట్లు పూర్తి కావస్తున్నాయని, చెరువుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రైతు భరోసా అమలుచేయాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారులకు అభినందనలు


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

అక్కన్నపేట(హుస్నాబాద్): రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలో పాల్గొన్న గౌరవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం అనంతుల జ్యోతి, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో పాల్గొన్ని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడంతో సంతోషంగా ఉందని, జాతీయస్థాయికి ఎంపిక కావాలని సూచించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసమే కాల్వల నిర్మాణం


మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్‌రూరల్: గౌరవెల్లి ప్రాజెక్టుద్వారా పొలాలకు నీరు అందించేందుకే కాల్వల నిర్మాణం చేపడుతున్నామని ఆర్డీఓ రామ్మూర్తి చెప్పారు. పందిల్ల గ్రామంలో భూ సేకరణ కోసం బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పూర్తిచేస్తోందన్నారు. కాల్వల నిర్మాణం కోసం రైతులు భూములు స్వచ్ఛందంగా ఇవ్వడానికి ముందుకు వస్తే త్వరగా పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దు వివాదంపై సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ సురేఖ

కోహెడ(హుస్నాబాద్): తంగళ్లపల్లి, కూరెల్ల, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల శివారు మోయతుమ్మెదవాగు సమీపంలోని శ్రీప్రతాప రుద్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయప్రాంగణం వివాదంపై తహసీల్దార్ సురేఖ బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. 15యేళ్లుగా ఆలయం ప్రాంగణంపై వివాదం నెలకొంది. ఆమె మాట్లాడుతూ జాతర తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో రెండు గ్రామాల మధ్య సఖ్యత నెలకొల్పేందుకే సమావేశం నిర్వహించామని, సఖ్యత కుద రకపోవడంతో మరో మారు సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

‘ముక్కోటి’కి సంసిద్ధం

తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన దుబ్బాక బాలాజీ ఆలయంతో పాటు సుప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం, వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలోని వెంకటేశ్వరాలయాలు ముక్కోటి ఏకాదశి మహోత్సవానికి ముస్తాబయ్యాయి. ఈ మహోత్సవం సందర్భంగా శుక్రవారం తెల్లవారు జామున వైకుంఠ ఉత్తరద్వారం గుండా స్వామి వార్లు భక్తజనావళికి దివ్యదర్శనమివ్వనున్నారు. మూడు రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శనాలు చేసు కుంటారు. అందుకు అనుగుణంగా ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశాయి.

ముస్తాబైన దుబ్బాక బాలాజీ, నాచగిరి, వర్గల్ క్షేత్రాలు

- శుక్రవారం నుంచి స్వామివార్ల ఉత్తరద్వార దర్శనం
- మూడు రోజులపాటు ఉత్సవాలు
- ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు


సర్వాంగ సుందరంగా ముస్తాబైన దుబ్బాక బాలాజీ ఆలయం

దుబ్బాక: తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన దుబ్బాక బాలాజీ ఆలయంలో మాధవనంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి 50వేలకుపైగా భక్తులు తరలివస్తారని ఆలయ కమిటీ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్ తెలిపారు. ఉదయం 5గంటలకు స్వామివారి ఉత్తరద్వార దర్శనం, ద్వారపూజ, ద్వారప్రవేశం ప్రారంభమవుతుంది. 7గంటలకు ప్రత్యేక అర్చనలు ఉంటాయి. 12వ తేదీ ఆదివారం ఉదయం 11గంటలకు గోదా కల్యాణం జరిపేందుకు నిర్ణయించారు.

ఎమ్మెల్యే, ఎంపీతో పాటు ప్రముఖుల రాక

ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి దర్శనానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావుతో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరాలయంలో శుక్రవారం తెల్లవారుజామున 4గంటలకు స్వామివారికి విశేషాభిషేకం, 5.45ని.లకు ఉత్తరద్వార ప్రవేశం, స్వామివారి దర్శనం, తులసి అర్చన, 11గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుంది. నాచగిరిలో తెల్లవారుజామున అభిషేకం, విశేషాలంకరణ అనంతరం స్వామివారు దివ్యదర్శనమిస్తారు. పర్వదిన వేడుకల వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని నాచగిరి ఈఓ పార్నంది విశ్వనాథశర్మ, వర్గల్ క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు.

ఉత్తరద్వార దర్శనం శుభకరం

ముక్కోటి ఏకాదశి విశేష పర్వదినం రోజు ప్రాతఃకాలం వైకుంఠ ఉత్తర ద్వారంలో వేంచేసిన స్వామివారిని ముక్కోటి దేవతలు సేవిస్తారని వర్గల్ క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి తెలిపారు. పర్వదినవేళ ఉత్తరద్వారంలో శ్రీవారిని దర్శించుకుంటే పాపాలు తొలగి, సకల శుభాలు సిద్ధిస్తాయని శాస్త్రాలు, పురాణాలు చెబుతున్నాయన్నారు. స్వామి వారితో పాటు ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యఫలం దక్కుతుందని చెప్పారు.


వర్గల్ ఆలయంలో స్వామి అమ్మవార్లు


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రామకోటి రామరాజు

ప్రత్యేక ఆహ్వానం

దుబ్బాక: బాలాజీ ఆలయానికి భద్రాచల దేవస్థానం ముక్కోటి ఏకాదశి ప్రత్యేక ఆహ్వాన పత్రికను బుధవారం శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆలయ కమిటీ బాధ్యులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో ఆల యం చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, వైస్ చైర్మన్ చింత నాగేందర్, ప్రధాన కార్యదర్శి చింత రాజు, ప్రధాన అర్చకుడు అచ్చి లక్ష్మీ నర్సింహ ఆచార్య పాల్గొన్నారు.

ఆరుబయట చెత్త వేయొద్దు

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్


పనులు పరిశీలిస్తున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేటే లక్ష్యంగా సాగుతున్న పట్టణంలో ఆరుబయట చెత్త వేయవద్దని, నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక నాసర్‌పురలో ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణ గురించి ఆరా తీశారు. మురుగు కాల్వల్లో చెత్త, మట్టిని తొలగించాలని సిబ్బందికి సూచించారు. కప్పలకుంట ప్రాంతంలో పోగైన చెత్తను తొలగించాలని ఆదేశించారు. సమీప ప్రజలు ఆరుబయట రోడ్డుపై చెత్త వేస్తున్న విషయాన్ని గమనించి, చెత్తను మున్సిపల్ వాహనాల సిబ్బందికి ఇవ్వాలని అవగాహన కల్పించారు. ట్రాక్టర్‌కు రూ.500, ఆటోకు రూ.100 యూజర్ చార్జి వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ఫంక్షన్‌హాల్ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.25వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం పలు వ్యాపార వాణిజ్య సంస్థలను తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి ఉండాలని వారికి సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాలోతు సంగీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఒక సెట్‌ను పాఠశాలలో అందించాలని సూచించారు.

ఉచిత ఫౌండేషన్ శిక్షణకు..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా ఫౌండేషన్ శిక్షణను అందించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ అహ్మద్ బుధవారం తెలిపారు. నాలుగు నెలల పాటుగా ఉచితంగా శిక్షణ అందిస్తామని, 17లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటఅర్బన్: పొన్నాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాసులు బుధవారం పేర్కొన్నారు. పొన్నాల, సంతోష్ నగర్, ఇందిరమ్మ కాలనీ, బట్టిరామన్న పల్లి, కిష్టసాగర్, చిల్ల కాలనీ, ఆటోనగర్, గాంధీనగర్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, మాత్‌పల్లి, కోనాయిపల్లి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని సంఘం నాయకులు బుధవారం తెలిపారు. అధ్యక్షుడిగా వంగ తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్ర రామచంద్రరెడ్డి, జనరల్ సెక్రెటరీగా సద్ది నాగరాజురెడ్డి, జాయింట్ సెక్రటరీగా అంకిళ్ల వేణుగోపాల్ రెడ్డి, కోశాధికారిగా అంకిల్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మాధవరెడ్డిగారి గోపాల్ రెడ్డి, తడిసిన సుమన్‌రెడ్డి, ముద్దం రామచంద్రారెడ్డి, రావిపల్లి ప్రవీణ్ రెడ్డి, అందె శ్రీనివాస్ రెడ్డి, శారకొండ రవీందర్ రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.


అధ్యక్షుడు తిరుమలరెడ్డి


కార్యదర్శి నాగరాజు రెడ్డి


సహాయ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి

పారిశుద్ధ్య పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌నర్సాపూర్‌లోని కొండపోచమ్మ ఆలయం వద్ద అధికారులు బుధవారం పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. ఆలయం వద్ద నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, జాతర ఏర్పాట్లపై 7న సాక్షిలో ‘సమస్యల జాతర’ అనే కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి ఆలయ ఈఓ రవికుమార్, ఎంపీడీఓ యాదగిరి స్పందించారు. దీంతో ఆలయ సమీపంలో కార్యదర్శి ప్రశాంత్ పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. అలాగే ఖాళీస్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపచేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు.


శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

కోహెడ(హుస్నాబాద్)/మర్కూక్(గజ్వేల్)/దుబ్బాకటౌన్: పోలీసు అధికారులు పలుచోట్ల విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తుపదార్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. కోహెడ కొత్తబస్టాండ్ వద్ద ఎస్‌ఐ అభిలాష్ గ్రామస్తులతో మాట్లాడారు. వివిధ రూపాల్లో జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. అలాగే మర్కూక్ మండలంలోని పాములపర్తి పాఠశాలలో ఎస్‌ఐ దామోదర్ మాట్లాడారు. పోలీసులమని, సీబీఐ అధికారులమని ఎవరైనా ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలన్నారు. హెచ్‌ఎం సయ్యద్ లతీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఐ గంగరాజు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్ విధుల గురించి వివరించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా బుధవారం న్యాయమూర్తి రూ.15,500 జరిమానా, వారిలో ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

సిటిజన్ సెల్‌ను సంప్రదించండి..

హుస్నాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొని, సర్వేలో తమ పేర్లు రానివారు మున్సిపల్ కార్యాలయంలోని సిటిజన్ సెల్‌ను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఫారం, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో మరోసారి యాప్‌లో వివరాలను నమోదు చేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాణ్యమైన ఆహారం, విద్యే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతోపాటు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల రిసిడెన్షియల్ హాస్టల్‌లో పూజల హరికృష్ణ ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన వాటర్ ఆర్వో ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుకు వెళ్తోందన్నారు. అన్ని వసతిగృహాలు, గురుకులాల్లో కామన్ డైట్ మెనూతో ప్రతి విద్యార్థికి ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నామని చెప్పారు. అంతకు ముందు పార్టీ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సిద్దిపేట రూరల్ మండల చిన్నగుండవెల్లికి చెందిన చిన్నారికి రూ.25వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో మహేందర్‌రావు, యాదగిరి, కలీమొద్దీన్, ముద్దం లక్ష్మి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న హరికృష్ణ

కల్యాణం.. కమనీయం

నంగునూరు(సిద్దిపేట): పాలమాకుల వేంకటేశ్వరాలయంలో గోధారంగనాథస్వామి కల్యాణం వైదికులు రణధీరాచార్యుల ఆధ్వర్యంలో బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారి అభిషేకం, ఉత్సవమూర్తుల ఊరేగింపు, పల్లకిసేవ నిర్వహించారు. వికాస తరంగిణి సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, సత్యనారాయణ, అశోక్, మల్లేశం, రామానుజం, శ్రీహరి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

పోషకాహారంతోనే ఆరోగ్యం: ఎంఈఓ

జగదేవ్‌పూర్(గజ్వేల్): పోషకాహారంతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంఈఓ మాధవరెడ్డి అన్నారు. మండలంలోని తిగుల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఇంటి నుంచి వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకువచ్చి ప్రదర్శించారు. పోషకాహారంపై పిల్లలకు అవగాహన కల్పించడానికే ఈ ఫెస్టివల్ నిర్వహించినట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ మారేడుపల్లి అధ్యక్షుడు సింకు ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు, నోట్ పుస్తకాలను అందించారు. హెచ్‌ఎం సైదులు, కనకయ్య, గోపికళ, భూమయ్య, మహేందర్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆహారపదార్థాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

సిద్దిపేటరూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా కలెక్టరేట్‌లో టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకొని ముగ్గులపోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఎదుర్కొంటున్న సవాళ్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలియజేస్తూ ముగ్గులు వేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంఘం ప్రతినిధులు సురేందర్ రెడ్డి, నాగేష్, సుమన్, వినయ సుకుమారి, జబీనా తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తంగళ్లపల్లిలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లిలో ప్రత్యేక అధికారి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు సంక్రాతి ముగ్గులు వేశారు. విజేతలను మండల పోటీలకు ఎంపిక చేశారు. మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరిశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కష్టాలు

సిద్దిపేటరూరల్: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కష్టాల బారిన పడేసిందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ఎల్లారెడ్డి, పరశురాములు, రాజు, కనకాంబరం, ఎల్లయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు. ఇర్కోడ్ వద్ద నిర్వహించిన ధర్నాలో చందర్‌రావు, యాదయ్య, సత్యనారాయణ, పరమేశ్వర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, భిక్షపతి, గోపినాథ్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళా సాధికారతకు పెద్దపీట

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు పెద్దపీట వేశాయని ఎస్‌ఐ తోట మహేశ్ అన్నారు. స్థానిక మాంటెస్సరీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం మహిళలకు రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ అబ్దుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ గ్రీన్‌బోర్డులు వితరణ

వర్గల్(గజ్వేల్): మండలంలోని బొర్రగూడెం ప్రాథమిక పాఠశాలకు బుధవారం మండల పీఆర్‌టీయూ తరపున రెండు గ్రీన్‌బోర్డులను హెచ్‌ఎం రాజనరేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

దుబ్బాకటౌన్: ఆజాద్ డిఫెన్స్ అకాడమీ నూతన క్యాలెండర్‌ను రాయపోల్ ఎస్‌ఐ విక్కుర్తి రఘుపతి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, డిఫెన్స్ వంటి రంగాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువత వాటిలో చేరి దేశానికి సేవ చేయాలన్నారు. అకాడమీ చైర్మన్ నీల చంద్రం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కాళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్, రాష్ట్రీయ బాల స్వచ్ఛంద ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సలీం, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాగిల్లాపూర్‌లో..

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్‌లోని ఈశ్వర్ ఆస్పత్రి సహకారంతో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గాగిల్లాపూర్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 200మందికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. వైద్యులు ఈశ్వర్, సమత, సాయిప్రియ, స్వర్ణలత, మాజీ సర్పంచ్ పులి శ్రీనివాస్, సంతోష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

◆ 300 మందికి నేత్రవైద్య పరీక్షలు



వర్గల్(గజ్వేల్): స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. గజ్వేల్ కంటి ఆస్పత్రి, లోక్‌నేత్ర ట్రస్ట్ వైద్య నిపుణులు సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నేత్ర పరీక్షలు జరిపారు.

◆ కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం

మిరుదొడ్డి(దుబ్బాక): అధికారంలో ఉన్నామన్న గర్వంతో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పార్టీ కార్యాలయంపై దాడిని నిరసిస్తూ మిరుదొడ్డిలో కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనంచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరసనల పేరుతో కార్యాలయంపై దాడి చేయడం దారుణం అన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రోశయ్య, దేవరాజు, అమర్, స్వామి, సదానంద రెడ్డి, కరుణాకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

గజ్వేల్‌రూరల్: బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులదాడి హేయమైన చర్యని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కవ్వింపు చర్యలను మానుకోవాలన్నారు. వెంకట్, వెంకట్‌రెడ్డి, నర్సింహ, సందీప్, విజయ్, కృష్ణాగౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.